క్లుప్తంగా

రేపు సత్రం షాపులకు బహిరంగ వేలం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శ్రీ పైండా వెంకన్న అన్నసత్రం అధీనంలోని 2, 4, 5 నంబర్లు గల షాపులకు లీజు నిమిత్తం ఈ నెల 4న ఉదయం 10 గంటలకు అన్నసత్రం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ పీఎస్‌జేఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఇతర వివరాలకు అన్న సత్రం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మెజిస్ట్రేట్‌కు ఘన వీడ్కోలు



మెజిస్ట్రేట్ సుధాకరరావుకి వీడ్కోలు పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించిన దొమ్మేటి సుధాకరరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ మెజిస్ట్రేట్‌కి దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. మెజిస్ట్రేట్ సుధాకరరావు మాట్లాడుతూ బెంచికి న్యాయవాదులు చక్కగా సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, కార్యవర్గ సభ్యులు చక్రవర్తి, పృథ్వీ, సత్యవాణి, న్యాయవాదులు వినయ్ బాబు, జయశంకర్, కేవీవీ సత్యనారాయణ, గంగాధర్, సూరంపూడి సత్యనారాయణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగర పీహెచ్‌సీ తనిఖీ



అంగర పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న శివరంజని

కపిలేశ్వరపురం: స్థానిక అంగర పీహెచ్‌సీని రామచంద్రపురం వైద్య ఆరోగ్య శాఖ సబ్ డివిజనల్ అధికారి కె.శివరంజని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది పనితీరు, రోగులకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్యసేవలు, ల్యాబ్ పరీక్ష తీరు, ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి జె.అనూజ ప్రియాంక, ఎంపీహెచ్‌ఎస్ పి.సురేష్ తదితరులున్నారు.

30 మందికి కంటి పరీక్షలు

కపిలేశ్వరపురం: మాచర సచివాలయంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 30 మందికి కంటి పరీక్షలను చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 15 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నలుగురుకి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, శ్రావణి, ఆశ కార్యకర్తలు సామ్రాజ్యలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఝాన్సీ సేవలందించారు.

రీ సర్వేతో పక్కాగా భూముల లెక్క

మండపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో భూముల లెక్కా పక్కా అవుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నేత గారపాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మెర్నిపాడులో మంగళవారం పాస్‌బుక్ పంపిణీని వారు ప్రారంభించారు. రైతులకు పాస్‌బుక్‌లు అందజేశారు. జెడ్ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, వీఆర్‌ఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జయంతి ముగింపు సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

కె.గంగవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5న జరిగే ముగింపు సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని కోటిపల్లిలో పైడా వారి సత్రం వద్ద మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయన్నారు. ఈ నెల 5న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో ముగింపు సభ జరుగుతుందని అన్ని గ్రామాల నుంచి ఎస్సీ మోర్చ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలన్నారు. ఈ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి పురందేశ్వరి, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. మండల అధ్యక్షులు ఏవీ రమణమూర్తి, జంగా రాజేంద్రకుమార్, దాకే వెంకటరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంతో కష్టం.. రైతులకు నష్టం

- ఈదురుగాలులతో భారీ వర్షాలు
- నేలనంటిన వరిపంట
- రైతన్నల ఆందోళన



కాజులూరులో ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలకొరిగిన వరిచేను

కాజులూరు: నియోజకవర్గంలోని గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఓ పక్క చీడపీడలను ఎదుర్కొనడానికే ఇబ్బంది పడుతున్న తరుణంలో వాతావరణం కూడా కన్నెర్ర జేస్తుందని రైతన్నలు లబోదిబోమంటున్నారు. పండించిన పంట గింజలు అందంగా చేతికి దక్కుతాయని ఆశించిన రైతుల ఆశలను అశనిపాతంలా భారీ వర్షాలు ఆవిరి చేస్తున్నాయి. పంట మాసూళ్ల దశలో దిగుబడికి వాతావరణం మంచి అనుకూలంగా ఉందని రైతులు సంతోషిస్తున్న సమయంలో విడవకుండా కురుస్తున్న వర్షాలు నియోజకవర్గంలోని గ్రామాల్లోని రైతులను నష్టాల్లోకి నెట్టేసింది. వర్షానికి తోడు ఈదురుగాలులు తోడవడంతో ఏపుగా పెరిగి కోత దశకు చేరిన వరిపైరు నేలనంటింది. ఇప్పటికే తెగుళ్ల బెడదతో 90 శాతం పెట్టుబడి పెట్టి పంటకోసం ఆశగా చూస్తున్న తరుణంలో 'మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందంగా' వర్షాలు రైతును నష్టపరుస్తున్నాయని తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి అన్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షం వరి కుప్పలుగా, ధాన్యం రాశులుగా ఉంచిన పంటకు తీవ్రనష్టం కలగజేసింది. వర్షానికి మాసూళ్లు నిర్వహిస్తున్న ధాన్యం తడిసి ముద్దయింది. ఇకపైనైనా వర్షాలు తగ్గకపోతే పంటలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరద నీటితో ఇక్కడి పల్లపు ప్రాంతాల్లోని పొలాలు ముంపునకు గురౌతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల గుండెల్లో గుబులు

రాయవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. మంగళవారం ఒక పక్క మండే ఎండ మరో పక్క ఆకాశంలో కమ్ముకున్న దట్టమైన మబ్బులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలో 16వేల ఎకరాల్లో రబీ వరిసాగు జరిగింది. ఇప్పటికే 40 శాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. యంత్రాలపై వరికోతలు కోసిన రైతులు ధాన్యంలో తేమ తగ్గేందుకు చేలల్లోను, రహదారిపై ఆరబెడుతున్నారు. ఈ సమయంలో వర్షాలు తీరని నష్టాన్ని కలిగించాయి. వర్షానికి తడిసిన ధాన్యాన్ని రహదారులపై గుట్టలుగా పెట్టి పగటిపూట ఆరబెట్టుకుంటున్నారు.

బట్టీ యజమానులను సైతం

వాతావరణ పరిస్థితులు ఇటు రైతులనే కాకుండా అటు ఇటుక బట్టీల యజమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్కసారి వర్షం పడితే నాలుగు రోజుల వరకూ ఇటుకుల ఉత్పత్తి చేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా వస్తున్న ఈదురుగాలులు, వర్షానికి బట్టీ యజమానులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. వర్షం వచ్చే సమయంలో బట్టీల్లో తీసిన పచ్చి ఇటుకలను బరకాలతో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



గొల్లపాలెంలో నీటిలో ఉన్న వరి పనలను ఒడ్డుకు చేరుస్తున్న రైతులు



ఈదురుగాలులు, వర్షానికి ధాన్యం రాశులపై బరకాలు కప్పుకుంటున్న రైతులు

హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించండి



రామచంద్రపురంలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రజలను కోరారు. పట్టణంలోని 23 వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూశారన్నారు. వారికి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వార్డు కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, కౌన్సిలర్లు కేతా శ్రీను, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ఏఈ దుర్గాప్రసాద్, టీపీఓ మణిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, పార్టీ నాయకులు మల్లిడి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ప్లాట్లలో సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: టిడ్కో ప్లాట్లలో లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం స్వలాభం చూసుకుందే తప్ప పేద సమస్యలు పట్టించుకోలేదన్నారు. తొలి విడత టిడ్కో ప్లాట్లలో సమస్యల పరిష్కారం, రెండో విడత పంపిణీ గురించి మంగళవారం ప్లాట్ల వద్ద మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో ఎమ్మెల్సీ తోట సమీక్ష నిర్వహించారు. తొలి విడతగా 2,100 ప్లాట్లు స్వాధీనం చేయగా ఇప్పటికీ 650 మంది ప్లాట్లలోకి చేరినట్టు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. రెండో విడతలో 4వేల ప్లాట్లకు పంపింగ్ హౌస్ నిర్మాణ పనులు మరో రెండు మూడు నెలల్లో పూర్తవుతాయని పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ శ్రీనివాసరావు వివరించారు. ప్రజల నుంచి వస్తున్న వాటర్ లీకేజీలు, విద్యుత్, ప్లంబింగ్ తదితర సమస్యలపై ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరితగతిన రెండో విడత ప్లాట్లు పనులు పూర్తి చేసి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో దివంగత వైఎస్ హయాంలో పేదలకు సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తే, అదేబాటలో ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేస్తున్నారన్నారు. అయితే టీడీపీ ఎన్ని అంతస్తులు నిర్మిస్తే ఎంత వెనకేసుకోవచ్చునని చూశారే తప్ప పేదల సమస్యలు గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. గతంలో తాను రామచంద్రపురం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ షీర్‌వాల్ టెక్నాలజీని వ్యతిరేకించిన విషయాన్ని ఎమ్మెల్సీ తోట గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా ప్లాట్లు వద్ద అనేక సమస్యలు స్థానికులను పట్టిపీడిస్తుయన్నారు. ఎప్పటికప్పుడు లబ్ధిదారులు తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ నేత కొమ్ము రాంబాబు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కుడిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జగన్నాథగిరిలో నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న జేసీ ఇలాక్కియా తదితరులు

కాజులూరు: జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపై ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా జేసీ ఇలాక్కియా అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం జగన్నాథగిరి, పెనుమళ్ల, తణుమళ్ల తదితర గ్రామాలలో జేసీ ఇలాక్కియా, అధికారులు పర్యటించి వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. తర్లంపూడిలో ఆమె రైతులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రైతులు వర్షాలు తగ్గే వరకూ వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే మాసూళ్లు నిర్వహించి ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని సాధ్యమైనంత వరకూ రైతులు సూరక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపరచుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీట తడిసి రంగుమారిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జగన్నాథగిరి రఘురామ రైస్‌మిల్లులో మండల గ్రామాల్లోని రైసుమిల్లు యజమానులు, అధికారులతో జేసీ సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలుపై పలు సూచనలు చేశారు. కరప డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, మండల తాహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ, ఏవో వి.అశోక్, ఆర్ఐ వై ఏగేశ్వరరావు, వీఆర్వో ఈశ్వరరావు, సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పింఛను అందజేత



లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాయవరం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి నూతనంగా మంజూరైన డయాలసిస్ పెన్షన్‌ను మంగళవారం అందజేశారు. మండలంలోని మాచవరం-1 సచివాలయం పరిధిలో పలివెల సురేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. సర్పంచ్ కత్తుల సీతతామహాలక్ష్మి, ఎంపీటీసీ పలివెల శోభన చొరవ చూపి విషయాన్ని స్థానిక నేతల ద్వారా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు డయాలసిస్ పెన్షన్ మంజూరు చేయించినట్టు మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, పలివెల సతీష్ చేతుల మీదుగా రూ.10వేల పెన్షన్‌ను లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, వాలంటీర్ నూకరాజు పాల్గొన్నారు.

పూసలవారి కాలనీలో అలజడి



సంఘటన స్థలంలో పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో పూసలవారి కాలనీలో మంగళవారం ఒకింత అలజడి నెలకొంది. కాలనీలో పంచాయతీకి కామన్ సైట్‌గా వదిలిపెట్టిన స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు కాలనీవాసులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ద్రాక్షారామ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామన్ సైట్‌లో పాలిక లక్ష్మి ఇల్లు, రాజు అనే వ్యక్తి షెడ్, కోట లక్ష్మణరావు అనే రైతు రహదారి ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై కాలనీవాసులు తమ కాలనీలో వదిలిపెట్టిన కామన్ సైట్‌లో తమ అవసరాల మేరకు కమ్యూనిటీ హాలు నిర్మించుకునేందుకు నిర్ణయించుకున్నామని అంటూ ఆక్రమణలు తొలగించడానికి ప్రయత్నించి పాలిక లక్ష్మికి సంబంధించిన ఇంటి గోడను కూలగొట్టారు. దీనితో ఆమె ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ దుర్గారావు, కె.గంగవరం ఎస్సై చిరంజీవి, ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావులు సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వెళ్లి ఇరు పక్షాలతో మాట్లాడారు. ఆర్డీఓ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కరిద్దామని నచ్చచెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వీఆర్ ఓలు సాయి, రామకృష్ణ, మహిళా పోలీసులు శ్రీవిద్య, నందిని తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి సాయం



కిడ్నీ బాదితునికి సాయం అందిస్తున్న కరుణామయి యూత్ సభ్యులు

మండపేట: కేశవరంలో కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న నిరుపేదకు గ్రామానికి చెందిన కరుణామయి యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు బాసటగా నిలిచారు. గ్రామానికి చెందిన కె.వీర్రాజు కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. పేద వర్గానికి చెందిన ఆయనకు యూత్ సభ్యులు మంగళవారం రూ.3వేల నగదు, బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. గ్రామానికి చెందిన దేదీప్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అవ్వారు శివాజి చేతుల మీదుగా ఈ సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు పోసుపో అశోక్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మందపల్లి పోలాప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో కూలిపని చేసుకునే కొందరు యువకులు సంస్థగా ఏర్పడి చేతనైనంతలో ప్రతీనెల సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యూత్ సభ్యులను శివాజీ అభినందించారు. యూత్ సభ్యులు చంద్రమళ్ల సుధీర్, చుక్కా రాజేష్, పెన్నేటి చంద్రహాస్, శెట్టి విద్యాసాగర్, సమ్మతం చిన్న పాపారావు, పెనుముచ్చి శేఖర్, చంద్రమళ్ల ప్రకాష్, స్వర్గన్ రాజు, దొండపాటి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత కృషితోనే సమస్యల పరిష్కారం



కోలంకలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు

కాజులూరు: సంఘటిత కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉమ్మడి గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కంచర్ల చిన్నవీరభద్రరావు అన్నారు. మంగళవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి గోదావరి జిల్లాల పరిధిలో మే ఏడో తేదీన రాజమహేంద్రవరం మంజీరా కన్వెన్షన్ హాలులో జరగనున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావలసిందిగా సభ్యులను కోరారు. కోలంకలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరదా శేషారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిన్నవీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ఆర్యవైశ్యులను చైతన్య పరచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్య వైశ్య వర్గం నుంచి తెలుగు రాష్ట్రలలో రాజకీయంగానూ, ఆర్థికంగానూ ప్రాధాన్యం పొందిన పలువురు ప్రముఖులు హాజరై సంఘ సభ్యుల పురోగతిపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో వాసవీ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వాకచర్ల గుప్తా, జిల్లా నాయకులు బొడ్డు నారాయణ, నాళం కిట్టు, కంచర్ల ప్రసాద్, నాళం చిన్ని, సంఘం మండల కార్యదర్శి మల్లేశ్వరరావు, సభ్యులు వరదా వెంకటేశ్వరరావు, కొత్త రాజా, వంకాయల కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి అనంత లోకాలకు..

బంజారాహిల్స్(హైదరాబాద్): ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడిన బాలుడు మృతి చెందిన విషాద ఘటన మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆర్యావటం గ్రామానికి చెందిన భీంశంకర్, లవకుమారి దంపతులు కొంత కాలంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని ప్లాట్ నెం.861లో కాపలాదారులుగా ఉంటున్నారు. వీరికి కూతురు శ్రీలలిత, కుమారుడు వివేకానంద (7). మంగళవారం ఉదయం 10 గంటలకు వివేకానంద సహచర పిల్లలతో కలిసి పక్కనే ఉన్న ప్లాట్ నెం.862 ఖాళీ స్థలంలో ఆడుకుంటున్నాడు. ఈ ప్లాట్‌లోని నీటిగుంత ఇటీవల కురుస్తున్న వర్షాలతో పూర్తిగా నిండిపోయింది. ఆడుకుంటున్న వివేకానంద ప్రమాదవశాత్తూ గుంతలో పడిపోయాడు. చుట్టుపక్కల పిల్లలంతా అరుస్తూ బాలుడి కుటుంబ సభ్యులకు చెప్పారు. అంతా కలిసి గుంత దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే వివేకానంద అప్పటికే విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు పోస్టుమార్టం అవసరం లేదని పోలీసులను అడ్డుకున్నారు. తీవ్ర వాగ్వాదంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు నచ్చజెప్పి బాలుడి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రచార కార్యక్రమాలు కీలకం

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో ఆరోగ్య ప్రచార కార్యక్రమాలు అత్యంత కీలకమైనవని వైద్యాధికారి జె.అనూజ ప్రియాంక అన్నారు. స్థానిక అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల్లో మంగళవారం ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఆయా ఆసుపత్రుల వైద్యాధికారులు పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి, జె.అనూజ ప్రియాంక, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారి మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఆర్‌సీహెచ్, ఎన్‌సీడీ, పీఎంజేఎవై, ఈజేఎస్‌వై, ఆరోగ్య ఆసరా, జేఎస్‌ఎస్‌కే, ఆసుపత్రుల్లో ప్రసవాలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు.

నేటి నుంచి ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

అంబాజీపేట: కాలుష్య నివారణను అరికట్టేందుకు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, ఎవరైనా వాడినా, వినియోగించినా వారిపై శాఖాపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రతి గ్రామంలోను సచివాయల సిబ్బంది షాపులను పరిశీలిస్తారని ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారికి రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని సహకరించాలని ఆయన కోరారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టే పనుల్లో ఉపాధి కూలీలు



వెదురుమూడిలో తడిసిన ధాన్యాన్ని తరలిస్తున్న ఉపాధి కూలీలు

కపిలేశ్వరపురం: వెదురుమూడి వ్యవసాయ క్షేత్రంలో వర్షం ముంపునకు గురైన ధాన్యాన్ని ఉపాధి కూలీలు మంగళవారం సురక్షిత ప్రాంతానికి తరలించారు. వర్ష ప్రభావానికి గురైన వరి పొలాలను సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరిశీలించారు. తమ సుమారు 600 క్వింటాళ్ల ధాన్యం పొలంలో మునిగిపోయిందంటూ వెదురుమూడి రైతులు పలువురు ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాలపై ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఉపాధి కూలీలు ధాన్యంను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

వర్షపు నీటి తొలగింపునకు ప్రత్యేక చర్యలు

కె.గంగవరం: అకాల వర్షాల కారణంగా పంట పొలాల్లో ఉండిపోయిన వర్షపు నీరు కాలువల నుంచి కిందికి వెళ్లిపోయేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. మంత్రి వేణు ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలోని కూలీల సహాయంతో పంట కాలువల్లో పూడిక తీయడంతో పాటు గుర్రపుడెక్క తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. తద్వారా పంట పొలాల్లో నిల్వ ఉండిపోయిన వర్షపునీరు కిందికి దిగిపోవడానికి వీలుగా ఉంటుందన్నారు. రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని రెండు రోజుల పాటు వర్ష సూచన ఉందన్నారు. వ్యవసాయ శాఖ ఏఓ రవి, వ్యవసాయ సహాయకులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కాజులూరు: భారీ వర్షాల కారణంగా మండల గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తర్లంపూడి, చేదువాడ, మంజేరు, శీల, పెనుమళ్ళ, తనుమళ్ళ, తదితర గ్రామాల్లో రాజబాబు పర్యటించి వర్షాలకు నీట తడిసిన వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు.

బుచ్చి సర్వారాయుడికి నివాళి



కపిలేశ్వరపురంలో గానం చేస్తున్న హరికథా పాఠశాల విద్యార్థులు

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీసర్వారాయ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం కపిలేశ్వరపురం జమీందారు బలుసు బుచ్చి సర్వారాయుడు 132వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ప్రాంగణంలో వేద పాఠశాల ప్రిన్సిపాల్ తంగిరాల దత్తాత్రేయశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చిసర్వారాయుడు, పాఠశాలల వ్యవస్థాపకులు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావులకు ఘన నివాళులు అర్పించారు. కమ్మ వెంకట్రావు తదితర వక్తలు మాట్లాడుతూ భారతీ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకాలన్నారు. పాఠశాలల్లో తర్ఫీదు పొందిన విద్యార్థులు సంస్కృతి పరిరక్షణలో భాగస్వాములుకావడం గర్వకారణమన్నారు. హరికథా పాఠశాల ప్రిన్సిపాల్ అంగర శింగరాచార్యులు పర్యవేక్షణలో విద్యార్థుల హరికథా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

కనువిందుగా స్వామివార్ల కల్యాణం

కపిలేశ్వరపురం: స్థానిక దుర్గామాత సమేత పార్వతి పాపవినాసేశ్వర స్వామి, పార్వతీమాత సమేత అగస్త్రేశ్వర స్వామివార్ల దివ్య కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామానికి చెందిన భక్తులు తరలివచ్చారు. యలమంచిలి కృష్ణమూర్తి కల్యాణ పూజలు చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటికొండ కనకరాజు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

రాయవరం: పసలపూడిలో యువతి బుంగ దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తిపై అసభ్య ప్రవర్తనపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీఎస్‌ఎన్ సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కొవ్వూరు శ్రీను అనే వ్యక్తి దివ్యను అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న ఆమె నాన్నమ్మ శ్రీనుని మందలించగా ఆమెతో కూడా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, బూతులు తిట్టినట్టుగా వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన తొత్తరమూడి రాజు(52) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు కుతుకులూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఎన్‌ఓగా పనిచేస్తున్నాడు. మృతునికి ముగ్గురు సంతానం ఉన్నారు. అతని భార్య ఎనిమిది నెలలు క్రితం మృతి చెందింది. సోమవారం రాత్రి ఇంటిలో భోజనం చేసిన అనంతరం తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. మంగళవారం ఉదయం అతనిని నిద్రలేపేందుకు కుమార్తె దిగుమర్తి సింధు తలుపు తీయగా ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.